అర్హులకు ఆర్థిక కష్టాలు

- రాజంపేట మండలం నడిమి తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాని లబ్ధిదారులు
- పెరిగిన సిమెంట్, స్టీల్ ధరలు



నడిమితండాలో బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తయిన ఇంటి నిర్మాణం

రాజంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జనవరి 26న ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి. ప్రతి నియోజకవర్గానికి 3 వేల ఇళ్లను మంజూరు చేస్తూ అందులో భాగంగా మండలానికి ఒక మోడల్ గ్రామాన్ని ఎంపిక చేసింది. ప్రజా పాలనలో భాగంగా ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారునికి(వంద శాతం) మంజూరు పత్రాలను అందజేసింది. కాగా, పెరిగిన సిమెంట్, స్టీల్ ధరల ప్రభావం, ఆర్థిక పరిస్థితులు కారణంగా చాలా మంది ఇళ్ల నిర్మాణానికి ముందుకురావడం లేదు.

నడిమితండాలో 104 దరఖాస్తులు..

రాజంపేట మండలంలోని నడిమి తండా గ్రామాన్ని అధికారులు ఇందిరమ్మ మోడల్ గ్రామంగా ఎంపిక చేశారు. గ్రామంలో ఇళ్ల నిర్మాణానికి 104 దరఖాస్తులు రాగా అందరికి నియామక పత్రాలను అందించారు. గ్రామంలో ప్రస్తుతం 20 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చి పనులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం బేస్‌మెంట్ లెవల్ వరకు పనులు చేపట్టారు. మరో ఇద్దరు ముగ్గు (మార్కింగ్) పోసి వదిలేశారు. సుమారు 82 మంది నిర్మాణం చేపట్టడం లేదు.

పెరిగిన సిమెంట్ స్టీల్ ధరల ప్రభావమా?

స్టీల్, సిమెంట్ ధరలు పెరగడంతో లబ్ధిదారులు ఇల్లు కట్టుకోవడానికి ముందుకు రావట్లేదనే విమర్శలున్నాయి. సిమెంట్ గత 15 రోజుల క్రితం రూ.260 వరకు ఉండగా ప్రస్తుతం రూ. 300కు పైగా పెరిగింది. స్టీల్ ఒక క్వింటాల్‌కు రూ. 5400 నుంచి రూ. 5900 వరకు పెరిగింది. దీంతో అర్హులకు ఇళ్ల నిర్మాణానికి భారంగా మారింది.

ఆర్థికంగా ఇబ్బందితోనే



ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా గత జనవరి నెలలో ఇందిరమ ఇళ్ల నిర్మాణానికి మాకు మంజూరు పత్రం ఇచ్చింది. ప్రస్తుతం తమ దగ్గర డబ్బులు లేక పోవడంతో ఇంటి నిర్మాణం చేపట్టలేకపోతున్నాం. డబ్బులు ఉన్నపుడు కట్టుకోవాలని అనుకుంటున్నాం.

–చాందిబాయి, నడిమితండా

అర్హులు ఇళ్ల నిర్మాణం చేపట్టాలి



ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులు తప్పకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టాలి. మండలంలో నడిమితండాను మోడల్ గ్రామంగా ఎంపిక చేశాం. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాలు ఇచ్చాం. నిర్మాణ పనులు చేపట్టకపోతే ఉన్నతాధికారుల మేరకు నిర్ణయాలు తీసుకుంటాం.

– రఘురాం, ఎంపీడీవో రాజంపేట

భూ సమస్యల పరిష్కారానికే భూభారతి

- బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి



శెట్పల్లిసంగారెడ్డి సదస్సులో రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ కిరణ్మయి

లింగంపేట(ఎల్లారెడ్డి): భూ సమస్యలు పరిష్కరించడానికే భూభారతి పోర్టల్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి వెల్లడించారు. సోమవారం ఆమె లింగంపేట మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి, నల్లమడుగు, నాగారం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె శెట్పల్లిసంగారెడ్డి సదస్సులో మాట్లాడారు. అటవీ శాఖ భూముల వివాదాలను ఇరు శాఖల అధికారులు కలిసి సంయుక్తంగా సర్వే చేసి పరిష్కరించనున్నట్లు తెలిపారు. శెట్పల్లిసంగారెడ్డిలో 251 సర్వే నంబర్‌లో 50 మంది రైతులకు చెందిన 100 ఎకరాలు, 247 సర్వే నంబర్‌లో 40 మంది రైతుల 100 ఎకరాలు, 252 సర్వే నంబర్‌లో 10 మంది రైతుల 60 ఎకరాలు, 1429 సర్వేనంబర్‌లో 150 మంది రైతులకు చెందిన 300 ఎకరాలు సుమారు ఎనిమిది దశాబ్దాలుగా రైతులు కాస్తులో ఉన్నారు. వీరికి పాసుబుక్కులు, పట్టాలు ఉన్నా, సీలింగ్ అని చూపిస్తుండడంతో సంక్షేమ పథకాలు రావడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తూ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే బొట్టి భాగయ్యపై డమ్మీ ఖాతాలో 180 మంది రైతులకు చెందిన 220 ఎకరాలు బర్కరార్ పట్టాగా నమోదు చేసి వదిలేశారు. వీరికి పట్టాలు ఇవ్వాలని మైనారిటీ నాయకుడు మోహిద్ సబ్‌కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభ్యున్నతికి కృషి

గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి



గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డిని సన్మానిస్తున్న ఏఎంసీ చైర్మన్ మనోజ్

నిజాంసాగర్(జుక్కల్): గ్రంథాలయాల్లో పాఠకులకు అవసరమైన మౌలిక సదుపాయలు కల్పిస్తూ, గ్రంథాలయాల అభ్యున్నతికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్ పటేల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఆయనను ఘనంగా సన్మానించారు. గ్రంథాలయానికి ప్రహరితో పాటు మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం చేపట్టాలని కోరారు.

సౌత్‌క్యాంపస్ బాలికల హాస్టల్ సందర్శన

భిక్కనూరు : తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ బాలికల హాస్టల్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ దగ్గర చెట్లు బాగా పెరిగి పాములు వస్తున్నాయని దోమలు బెడద నెలకొందని విద్యార్థులు ఆయనకు పిర్యాదు చేశారు. వెంటనే ఆయన అధికారులతో మాట్లాడి ఉపాధి హామీ కూలీలలతో శుభ్రం చేయించాలని సూచించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరింపజేస్తానని చంద్రకాంత్‌రెడ్డి అన్నారు.

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



బాన్సువాడలో కాసుల బాలరాజుకు వినతిపత్రం అందిస్తున్న టీజీఈ జేఏసీ నాయకులు

బాన్సువాడ రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. సోమవారం రాత్రి ఉద్యమ కార్యాచరణలో భాగంగా టీజీఈ జేఏసీ రాష్ట్రశాఖ పిలుపుమేరకు స్థానిక ప్రతినిధులు కాసుల బాలరాజును కలిసి 57 సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు, 5పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ, హెల్త్‌కార్డులు, సీపీఎస్ రద్దు, పెన్షనర్ల బకాయిలు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యూలరైజేషన్ తదితర 57 సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో టీజీఈ జేఏసీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డా. దేవేందర్, అడిషనల్ సెక్రటరి కుశాల్, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, టీఎన్‌జీవో ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనే నిజమైన నివాళి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

బాన్సువాడ రూరల్ : బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అని ఆల్ ఇండియా బంజారా సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు బద్యానాయక్ అన్నారు. సోమవారం ఆయన బాన్సువాడ మండలం కాద్లాపూర్ గ్రామంలో దళితనాయకులు, గ్రామ అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులతో కలిసి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. దళితులు ఐక్యంగా ఉండి హక్కుల సాధనకు పాటుపడాలన్నారు. అనంతరం బుద్ధవందనం చేసి జైభీమ్ నినాదాలుచేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు బంగారు మైసయ్య, నెర్రె నర్సింహులు, గైనిరవి, మన్నె సాయిలు,దాదేకర్ సురేష్, పుండలిక్ నాగేందర్, షేక్ బాబు, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా టైలరింగ్ శిక్షణ



సదాశివనగర్‌లో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇస్తున్నామని గ్రామ స్వరాజ్యం జిల్లా కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన మండల సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. నిరుపేద కుటుంబాలకు ఈ శిక్షణ కార్యక్రమం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఎస్‌బీఐ బ్యాంక్ ద్వారా రాయితీపై కుట్టు మిషన్ ఇవ్వబడుతుందన్నారు. కుట్టు మిషన్ ధర రూ.18వేలుకాగా, రాయితీలో పికో, స్టిచ్చింగ్ సదుపాయం ఉన్న ఈమిషన్ కేవలం రూ.6500కు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాజిరెడ్డి, సీసీలు, కో–ఆర్డినేటర్‌లు పాల్గొన్నారు.

అ'పూర్వ' విద్యార్థుల సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

భిక్కనూరు: మండల కేంద్రంలోని విశ్వభారతి పబ్లిక్ స్కూల్‌లోని 2014–2015 పూర్వ విద్యార్థులు సోమవారం సమావేశమయ్యారు. దశాబ్దం తర్వాత 27 మంది విద్యార్థులు సమావేశమై చిన్ననాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. వచ్చే ఏడాది కుటుంబీకులతో కలిసి సమావేశం నిర్వహించుకోవాలని తీర్మానించుకున్నారు.

రైతుల పోరాటంతోనే భూ సంస్కరణల అమలు

- భూభారతి చట్టం అమలులో అవినీతి, అక్రమాలకు పాల్పడితే చర్యలు
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



నిజాంసాగర్‌లో ఎడ్లబండిపై ఊరేగింపుగా వస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): రైతుల పోరాటంతోనే భూ సంస్కరణలు అమలులోకి వచ్చాయని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. సోమవారం నిజాంసాగర్ మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం అవగాహన సదస్సుకు ఆయన ఎడ్లబండ్లపై వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పాలిట శాపంగా మారిన ధరణి పోర్టల్‌ను బంగాళ ఖాతంలోకి విసిరేస్తూ..., భూ భారతి పోర్టల్‌ను ప్రభుత్వం అమలులోకి తెచ్చిందన్నారు. రాష్ట్రంలో తొమ్మిది లక్షల 26 వేల సాదా బైనామాలు ఉన్నాయని, వాటిలో న్యాయమైన వాటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అన్నారు. భూ భారతి చట్టం అమలుతో పాటు భూముల సమస్య పరిష్కారం కోసం కార్యకర్తలు, నాయకులు, అధికారులు అవినితి, అక్రమాలకు పాల్పడితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భూ భారతి చట్టాన్ని గ్రామాలు, గిరిజన తండాల్లోకి తీసుకు వెళ్లి, భూ సమస్యలను పరిష్కరించే దిశగా రెవెన్యూ అధికారులు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో కలెక్టర్ అశిష్ సంగ్వాన్, పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి. మనోజ్‌కుమార్‌పటేల్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, మండల ప్రత్యేక అధికారిణి రమాదేవి, తహశీల్దార్ భిక్షపతి, మండల వ్యవసాయశాఖ అధికారి అమర్ ప్రసాద్ ఎస్సై శివకుమార్, కాంగ్రెస్ నాయకులు, రైతులు ఉన్నారు.

బీరప్ప కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే

పిట్లం(జుక్కల్): మండలంలోని అల్లాపూర్ గ్రామంలో బీరప్ప కామరతి దేవిల కల్యాణాన్ని సోమవారం మల్లికార్జున కురుమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకల్యాణంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మల్లికార్జున కురుమ సంఘం సభ్యులు ఎమ్మెల్యేకు గొంగళి కప్పి సన్మానించారు.ఈకార్యక్రమంలో కురుమ సంఘం సభ్యులు గోసాయిపల్లి మల్లేశం, పిట్లం, పెద్ద కొడప్‌గల్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మండ్లు, మహేందర్ రెడ్డి, నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

శ్రీరుక్మిణీ విఠలేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ రూరల్: మహారాష్ట్రలోని పండరీపూర్‌లో గల శ్రీరుక్మిణీ పాండురంగ విఠలేశ్వర స్వామీ దేవాలయాన్ని సోమవారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలో తన అనుచరులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. మరాఠీ సాంప్రదాయంలో చేసిన శ్రీపండరీపూర్ విఠలేశ్వరుని భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పోచారం శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, భైరాపూర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భేతాళ స్వామి గుడి పునర్నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

బాన్సువాడ రూరల్: పాతబాన్సువాడలోని భేతాళ స్వామి గుడి పునర్నిర్మాణ పనులను సోమవారం నాయకులు మాసాని శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి గణేశ్‌తో కలిసి ప్రారంభించారు. గుడి ఆవరణలో భూమిపూజ కార్యక్రమం చేపట్టారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, అంబర్‌సింగ్, జనార్ధన్‌రెడ్డి, బడి సాయిలు, నవీన్‌రెడ్డి, రఫీఖ్, ఉరటి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కిష్టాపూర్‌లో అఖండ హరినామ సప్తాహం



సప్తాహంలో పాల్గొన్న భక్తులు

పిట్లం(జుక్కల్): మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో అఖండ హరినామ సప్తాహ వార్షికోత్సవాన్ని సోమవారం పోచయ్య మహారాజు అధ్యక్షతన హనుమాన్ మందిరం వద్ద ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన టీచర్ నారాయణ మాట్లాడుతూ సప్తాహ కార్యక్రమం మే 5 వరకు కొనసాగుతుందన్నారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు దామోదర్ రాజ్, బాలరాజు, తుపాకుల సాయిలు, అవారి గంగాధర్, నిత్య హరినామ సంకీర్తన భజన మండలి భక్తులు మార్గం సాయిలు, గంపలి హన్మండ్లు, తుపాకుల బాలరాజ్, బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి బయలుదేరిన కుప్రియాల్ భజన మండలి సభ్యులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని కుప్రియాల్ గ్రామానికి చెందిన సత్యానంద భజన మండలి సభ్యులు సోమవారం తిరుపతికి బయలుదేరి వెళ్లారు. బుధవారం తిరుపతిలో నిర్వహించే అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలోని అన్ని వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భజన మండలి ప్రతినిధి రాజిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

సిద్ధరామేశ్వరాలయానికి గడ్డి వితరణ

భిక్కనూరు: మండలంలోని శ్రీ సిద్ధరామేశ్వరాలయంలోని కోడే దూడల ఆహారం కోసం పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన ఇటిక్యాల రవీందర్‌రెడ్డి, అల్లాడి అన్నయ్యలు సోమవారం ట్రాక్టర్ గడ్డిని విరాళంగా అందజేశారు. వీరిని దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అభినందించారు.

'ఎల్‌ఐసీ ఏజెంట్ల పాత కమీషన్ పునరుద్ధరించాలి'



మాట్లాడుతున్న కిషోర్‌చంద్

కామారెడ్డి అర్బన్: ఎల్‌ఐసీ యాజమాన్యం బీమా పాలసీలపై జీఎస్‌టీని గణనీయంగా తగ్గించడం లేదా పూర్తిగా రద్దు చేయాలని, ఏజెంట్లకు తగ్గించిన కమీషన్‌ను ఎప్పటిలాగే పునరుద్ధరించాలని భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య (లియాఫీ) ప్లానింగ్ కమిటీ జాతీయ ఉపాధ్యక్షుడు ఎల్.కిషోర్‌చంద్ అన్నారు. సోమవారం లియాఫీ కామారెడ్డి శాఖ కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు కదం నారాయణరావు అధ్యక్షతన జరిగింది. పాలసీదారులు, ఏజెంట్ల వివిధ సమస్యలపై చర్చించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కిషోర్‌చంద్ జాతీయ స్థాయి వస్తున్న మార్పులను వివరించారు. ఎల్‌ఐసీ యాజమాన్యం ఏజెంట్ల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలని లియాఫీ డిమాండ్ చేస్తుందన్నారు. సమావేశంలో పాల్గొన్న కామారెడ్డి ఎల్‌ఐసీ మేనేజర్ కృష్ణమోహన్ మాట్లాడుతు.. బ్రాంచ్ పరిధిలో ఏజెంట్ల సమస్యలను పరిష్కరించనున్నట్లు హామీ ఇచ్చారు. అనంతరం ఉగ్రదాడిని ఖండిస్తూ పహల్గాం మృతులకు ఆత్మ శాంతి కలగాలని ఎల్‌ఐసీ ఏజెంట్లు రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. ఈకార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజన్ నాయకుడు టి.మోహన్, ప్రతినిధులు ప్రదీప్‌కుమార్ జైన్, ఏ.ఉమాపతి, వి.రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరిష్కారమైన తాగునీటి సమస్య



బోరు పనులు ప్రారంభించిన నాయకులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో 6వ వార్డులో తాగునీటి సమస్యను తీర్చినందుకు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత కొన్ని రోజులుగా కాలనీలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు విన్నవించడంతో బోరు వేయించి, మోటారు బిగించేశారు. కార్యక్రమంలో విండో చైర్మన్ సదాశివరెడ్డి, సీడీసీ చైర్మన్ ఇర్షాదొద్దిన్, నాయకులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు క్లాత్ పంపిణీ



క్లాత్ అందజేస్తున్న ఎమ్మార్సీ సిబ్బంది

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం నుంచి సోమవారం స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ) గ్రూపులకు ఎమ్మార్సీ సిబ్బంది క్లాత్ అందజేశారు. మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న బాల బాలికలకు ఏకరూప దుస్తులు కుట్టడానికి ప్రభుత్వం క్లాత్‌ను ఎంఈవో కార్యాలయానికి సరఫరా చేసింది. ఎంఐఎస్ స్వప్న, ఏపీఎం శ్రీనివాస్, సీఆర్పీలు సత్యనారాయణ, గంగాధర్, రాజు, విజయ్, సంగాగౌడ్, సీసీలు గంగరాజం, శ్రావణ్‌కుమార్, మేహర్, స్వప్న, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదు



ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. తాడ్వాయిలోని 7వవార్డులో తాగునీరు సరిగ్గా సరఫరా కాకపోవడంతో ఇబ్బందులను ఎదర్కొంటున్నామని స్వామిగౌడ్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ స్పందిస్తూ గ్రామపంచాయతీ సిబ్బందితో మాట్లాడి తాగు నీటిసమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రహీమొద్దీన్, ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

భిక్కనూర్‌లో జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ నర్సింలు

ఎల్లారెడ్డిరూరల్ : మండలంలోని భిక్కనూర్ గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ నర్సింలు సోమవారం ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి విశ్వనాథం, రైతులు శ్రీకాంత్, మహేందర్ తదితరులున్నారు.

బస్సుల్లో సీనియర్ సిటిజన్ల సీట్లు రిజర్వు పాటించాలి



వినతిపత్రం అందిస్తున్న సీనియర్ సిటిజన్లు

కామారెడ్డి అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో సీనియర్ సిటిజన్లకు రిజర్వు చేసిన సీట్లలో వారినే కూర్చొనివ్వాలని, ఆదేశాలు పాటించని కండక్టర్లపై చర్యలు తీసుకోవాలని, బస్టాండ్లలో బెంచీలు, తాగునీటి వసతి, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, పరిశుభ్రంగా ఉంచాలని సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా కమిటీ సభ్యులు కామారెడ్డి డిపో మేనేజర్‌కు విజ్ఞప్తి చేసింది. సోమవారం ఫోరం జిల్లా అధ్యక్షుడు పున్న రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎం.రాజన్నలు డీఎంని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధులు పీవీ నరసింహం, మోహన్ రెడ్డి, రాంకిషన్, రాజేశ్వర్‌రెడ్డిలున్నారు.

సంక్షిప్తం

ఉపాధి హామీ పనుల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఎల్లమ్మ తండా గాంధీ నగర్ గ్రామాల శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. గ్రామ శివారులో చేపల చెరువు పనులు కొలతల ప్రకారం చేయాలని ఆదేశించారు. అనంతరం నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఆయన వెంట క్షేత్రసహాయకుడు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పలు గ్రామాలలో పశువైద్య శిబిరం

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని సోమార్‌పేట్, మౌళాన్‌ఖేడ్ గ్రామాలలో సోమవారం పశువైద్య శిబిరాలను నిర్వహించినట్లు వెటర్నరీ డాక్టర్ అర్చన తెలిపారు. పశువైద్య శిబిరంలో భాగంగా 145 ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలను వేయడం జరిగిందన్నారు. సిబ్బంది సాయిరెడ్డి, మహబూబ్, పాడి రైతులు సాయన్న, పోచయ్య తదితరులున్నారు.

'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తులు అందించాలి

బిచ్కుంద(జుక్కల్): రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఆన్‌లైన్‌లో 1,823 మంది దరఖాస్తులు చేసుకున్నారని ఎంపీడీవో గోపాల్ తెలిపారు. 1,381 మంది కార్యాలయంలో దరఖాస్తులు అందజేయగా, 442 మంది దరఖాస్తులు సబ్మిట్ చేయలేదని పేర్కొన్నారు.

కల్వరాల్‌లో యువత సంఘ శిక్షణ శిబిరం ప్రారంభం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని కల్వరాల్ గ్రామంలో సోమవారం యువత సంఘ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాంరెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని మృతికి సంతాపం

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి దేవీవిహార్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ల్యాగల సత్యనారాయణ (60) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన మృతికి పలువురు ఉపాధ్యాయులు, మున్నూరు కాపు సంఘం నాయకులు సంతాపం తెలిపారు. సత్యనారాయణ స్వగ్రామమైన లింగంపేట మండలం కోర్పోల్‌లో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.

బాలుకు వెలుగు పురస్కారం ప్రదానం



కామారెడ్డి అర్బన్: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు రక్తసేకరణలో విశేష కృషి చేస్తున్న కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకులు బాలుకు వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ తెలుగు రాష్ట్రాల జాతీయ స్థాయి పురస్కారానికి అందజేసింది. గోదావరిఖనిలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ సురభి శ్రీధర్ తదితరులు పురస్కారం అందజేసి ఘనంగా సన్మానించారు. కామారెడ్డి జిల్లాలో 200 మంది తలసేమియా వ్యాధిగ్రస్తులు ఉన్నారని వారికి ప్రతి నెల 400 యూనిట్ల రక్తం అవసరమని బాలు అన్నారు.